సాక్షి కుమురం భీం

ఆదివారం । 14 । జూలై । 2024



కవ్వాల్.. జంతువులతో కళకళ

కవ్వాల్ టైగర్‌జోన్‌లో విస్తరించి ఉన్న అడవి వన్యప్రాణులకు ఆవాసం, అనువైన ప్రదేశంగా మారుతోంది. వన్యప్రాణులు, జంతువుల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. 10లో▸



అస్తవ్యస్తంగా పారిశుధ్యం!

వాంకిడి మండల కేంద్రంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మురుగు కాలువల నిర్వహణ సరిగా లేకపోవడంతనాలాల్లో మురుగు నీరు నిల్వ ఉంటోంది. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.6 /26.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్పీని కలిసిన జీఎం



ఎస్పీకి మొక్క ఇస్తున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లా ఎస్పీగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన డీవీ శ్రీనివాసరావును శనివారం బెల్లంపల్లి ఏరియా జీఎం రవి ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీని శాలువాతో సత్కరించి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఏరియాలో చేపడుతున్న బొగ్గు ఉత్పత్తితో పాటు తదితర విషయాలను ఎస్పీతో చర్చించారు. పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం పోలీస్‌శాఖ, సింగరేణి యాజమాన్యం కలిసి పని చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని ఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ సెక్యూరిటీ అధికారి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఎంలో 'గుర్తింపు' ఎన్నికలు నిర్వహించాలి

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్పీఎం)లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ గోలెం వెంకటేశం శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మిల్లులో రాచరిక వ్యవస్థ నిర్వహిస్తూ కార్మికులను ఇబ్బందులు పెడుతుందని ఆరోపించారు. మిల్లు పునఃప్రారంభమైన తర్వాత అందులో పనిచేసిన పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను పూర్తిస్థాయిలో విధుల్లోకి తీసుకోకపోగా స్థానికేతరులను తీసుకుందన్నారు. మిల్లులో పనిచేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలైన క్యాంటిన్, రెస్ట్‌రూం, ఫస్టెయిడ్ అందుబాటులో ఉంచడంలేదని, ప్రమాదవశాత్తూ ఏమైనా జరిగితే ఈఎస్ఐ ఆస్పత్రిలో వైద్యం అందని పరిస్థితి నెలకొందన్నారు. కార్మికులకు పండుగ బోనస్‌లు, జీతభత్యాల మీద అగ్రిమెంట్లు జరుపక యాజమాన్యం కార్మికులను మోసం చేస్తోందని ఆరోపించారు.

తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

కాగజ్‌నగర్ రూరల్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969 నుంచి తొలి, మలిదశ ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యమకారులకు న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూర్త సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1969లో ఒక ఏడాది పాటు విద్యను కోల్పోయి ఉద్యోగాలు రాక అనేక ఇబ్బందులకు గురైన ఉద్యమకారులకు ఇంతవరకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెన్షన్లు, ఉచిత వైద్యసౌకర్యాలతో పాటు 250 గజాల ఇంటి స్థలం, పిల్లలకు రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఎల్లాగౌడ్, రమణయ్య, దేవయ్య, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, శంకర్, సత్యనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'బాక్సింగ్ అసోసియేషన్‌కు గుర్తింపు లేదు'

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఉమ్మడి పది జిల్లాల అసోసియేషన్లకు మాత్రమే గుర్తింపు ఇచ్చిందని, నూతనంగా ఏర్పడిన జిల్లాలకు ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ సంఘం, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డిని కలిసి వివరాలు అందజేశారు. కొత్త జిల్లాల సంఘం బాధ్యులమంటూ ఎవరైనా ఎంపిక, ఇతర కార్యక్రమాలను చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కొట్టి దేవేందర్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

నెన్నెల: డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచి మెగా డీఎస్సీ ప్రకటించాలని, మరో 45 రోజులు వాయిదా వేయాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర కమిటీ సభ్యుడు మనోహర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరుస పోటీ పరీక్షలు వస్తుండగా నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందని, గ్రూపు-2 పరీక్షలు కూడా వాయిదా వేయాలని పేర్కొన్నారు. నిరుద్యోగుల పోరాటం ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందనే విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రొఫెసర్ కోదండరాం, ఆకునూరి మురళి, బల్మూరి వెంకట్ కల్పించుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో నిరుద్యోగులతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

ఆశ్రమాల్లో బయోమెట్రిక్

- గిరిజన పాఠశాలల్లో ఇక అక్రమాలకు చెక్
- రంగం సిద్ధం చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ
- గతంలో చేసిన ప్రయత్నం విఫలం
- ఈసారి పకడ్బందీగా ఏర్పాటు



ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మళ్లీ బయోమెట్రిక్ అమలుకు గిరిజన సంక్షేమశాఖ కసరత్తు చేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్టర్లలో అక్రమ హాజరు నమోదుకు అడ్డుకట్ట వేయనుంది. గతంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని.. ఈసారి పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో ఐటీడీఏ పరిధిలో మొత్తం 46 ఆశ్రమ ఉన్నత పా ఠశాలలు ఉండగా.. 3800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అలాగే 209 మంది ఎస్టీటీలు, 132 మంది స్కూల్ అసిస్టెంట్లు, 18 మంది పీజీ హెచ్ఎంలు, 450 మంది సీఆర్టీలతోపాటు మరో 300 మంది బోధనేతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

మూలకు చేరిన పరికరాలు

పారదర్శకత, పర్యవేక్షణ కోసం గతంలో గిరిజన సంక్షేమశాఖ కొన్ని ఆశ్రమ పాఠశాలల్లో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేసింది. అయితే అనివార్య కారణాలతో పరికరాలు మూలనపడ్డాయి. ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల హాజరుపై పర్యవేక్షణ లేకుండా పోయింది. కొన్నిచోట్ల తప్పుడు వివరాలు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. బయోమెట్రిక్ విధానంలో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వేలి ముద్రలు వేయాల్సి ఉండటంతో సమయపాలన సాధ్యమవుతుంది. అలాగే సరుకులు, నిధుల వినియోగంలో పారదర్శకత పెరుగుతుంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేసేందుకు వీలు కలుగుతుంది. బయోమెట్రిక్ హాజరును హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయం నుంచి పర్యవేక్షించనున్నారు. ఒకవేళ వేలిముద్రలు పడని పక్షంలో ఐటీడీఏ అధికారులతో సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. బయోమెట్రిక్ అమలులోకి వస్తే ప్రతీ పాఠశాలలో విద్యార్థుల వాస్తవ సంఖ్య తెలియడంతోపాటు బోధన, బోధనేతర సిబ్బందిపై పర్యవేక్షణ పెరుగుతుంది. దీని ఆధారంగా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండే పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించవచ్చు. హాజరు వివరాలను ప్రతిరోజూ ఉదయం 10 గంటలలోగా సంబంధిత అధికారులకు వాట్సాప్, ఈమెయిల్ ద్వారా పంపించాల్సి ఉంటుంది.

ప్రభుత్వ బడుల్లో 'ఎఫ్ఆర్ఎస్'

ప్రభుత్వ పాఠశాల(లోకల్ బాడీ)ల్లో ప్రస్తుతం ప్రస్తుతం ఫేసియల్ రికగ్నైజేషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్) అమలు చేస్తున్నారు. జిల్లాలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలు మొత్తం 720 వరకు ఉండగా.. 42 వేల మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. గతంలో ఈ పాఠశాలల్లో కూడా బయోమెట్రిక్ అమలులో ఉండేది. అయితే కొన్నిరోజుల తర్వాత విద్యాశాఖ అధికారులు ఈ విధానానికి స్వస్తి పలికారు. సిగ్నల్, నెట్‌వర్క్ సమస్యలు తలెత్తడంతోపాటు ఐడీలు పని చేయకపోవడం, వేలిముద్రలు పడకపోవడం వంటి తదితర టెక్నికల్ సమస్యలతో బయోమెట్రిక్ ఆగిపోయింది. గతేడాది నుంచి అన్ని పాఠశాలలకు ట్యాబ్‌లు అందించడంతో ప్రస్తుతం ఎఫ్ఆర్ఎస్ విధానంతోనే హాజరు నమోదు చేస్తున్నారు. ఈ విధానం త్వరలో ఉపాధ్యాయులకు కూడా అమలు చేయనున్నారు.

అధికారిక ఉత్తర్వులు రాలేదు



గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో బయోమెట్రిక్ అమలుపై ఇప్పటివరకు అధికారికంగా ఉత్తర్వులు రాలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం విద్యార్థుల హాజరును పక్కాగా నమోదు చేస్తున్నాం. – పి.రమాదేవి, డీడీ, గిరిజన సంక్షేమశాఖ

సివిల్, ఏఆర్ ఫోర్స్ రెండు కళ్లలాంటివి

- ఎస్పీ డీవీ.శ్రీనివాసరావ్

ఆసిఫాబాద్‌అర్బన్: రక్షణ, శాంతి భద్రతల విషయంలో సివిల్, ఏఆర్ ఫోర్స్ రెండు కళ్లలాంటి వారని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఆర్మ్‌డ్ రిజర్వు ఫోర్సుతో నిర్వహించిన దర్బార్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పెండింగ్ బిల్లుల సమస్య కూడా వీలైనంత త్వరగా పరిష్కరిస్తానన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్, ట్రాఫిక్, క్రైం వంటి ప్రధాన విభాగాలతో పాటు ఏఆర్ విభాగం కూడా ఎంతో సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. సమస్యాత్మక పరిస్థితుల్లో ఘర్షణ నివారణలో, పండుగల బందోబస్తు, ఎన్నికల బందోబస్తు, గణేశ్ నిమజ్జనం ఊరేగింపు వంటి విధుల నిర్వహణలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల కృషి అభినందనీయమన్నారు. బదిలీలు, ప్రమోషన్లలో సిబ్బంది పనితీరుతో పాటు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని కూడా దృష్టిలో ఉంచుకుని తగు విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఏఆర్ విభాగపు సిబ్బంది సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. స్పెషల్ పార్టీ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో మావోయిస్టు కదలికలను నియంత్రించడంలో స్పెషల్ పార్టీ కృషి మరువలేమన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ రాణాప్రతాప్, ఆర్ఐ (అడ్మిన్) పెద్దన్న, ఆర్ఐఎంటీవో అంజన్న, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ శంకర్‌రెడ్డి, ఆర్ఎస్సైలు, ఏఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ దిద్దుబాటు

- ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో ప్రత్యేక టీంలు
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా

ఆసిఫాబాద్: జిల్లాలో నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. జిల్లా ఏర్పాటై ఎనమిదేళ్లు గడుస్తున్నా జిల్లా కేంద్రంలో రహదారుల విస్తరణ జరగడం లేదు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల పదవీ బాధ్యతలు తీసుకున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. పెరుగుతున్న రద్దీ దృష్ట్యా జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు రెండు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో 10 మంది పోలీసులు ఉంటారు. ప్రతీ చౌరస్తా వద్ద ఒక హెడ్‌కానిస్టేబల్, కానిస్టేబుల్‌ను నియమించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్, వివేకానంద చౌక్, ఎస్పీ క్యాంపు కార్యాలయం రహదారిపై రాంగ్ రూట్లో వెళ్లకుండా ఎస్పీ క్యాంపు కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారిపై, కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. ఆయా టీంలు ప్రతీరోజు వాహనాల తనిఖీతో పాటు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ నియంత్రణకు జాగ్రత్తలు తీసుకుంటారు. రాంగ్ రూట్లో వెళ్లే వాహనాలకు చాలానా విధిస్తారు.

రోడ్డుపైనే పండ్ల దుకాణాలు

జిల్లా కేంద్రంలో శనివారం, సోమవారం రద్దీగా ఉంటుంది. పట్టణంలో ప్రతి శనివారం వారసంత నిర్వహిస్తారు. కూరగాయల మార్కెట్‌ను జుబ్లీ మార్కెట్‌కు తరలించినప్పటికీ పండ్ల దుకాణాలు వివేకానంద చౌక్‌లో రోడ్లపైనే ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్‌లో రోడ్డుకు అడ్డంగా తోపుడు బండ్లు, చిరు దుకాణాలతో పాటు గాంధీచౌక్‌లో రోడ్డు మధ్యలో వాహనాల పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనికి తోడు వ్యాపారులు భారీ వాహనాల్లో ప్రతిరోజు రోడ్డుకు అడ్డంగా సరుకులు అన్‌లోడ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. తరచూ రోడ్డు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

నిబంధనలు పాటించాలి

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశాం. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేశాం. రాంగ్‌రూట్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడ్, మైనర్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుంది. త్వరలో జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్, రెబ్బెన, కెర్వ మెరి మండలాల ఆటో, ట్రాలీ డ్రైవర్లకు ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. – సతీశ్, సీఐ, ఆసిఫాబాద్

కొరవడుతున్న పర్యవేక్షణ

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణపై అధి కారుల పర్యవేక్షణ కొరవడుతోంది. పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఎదుట గుండి రహదారికి వెళ్లే దారిలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేక పోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంబేద్కర్ చౌక్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినప్పటికీ పనిచేయడం లేదు. చౌరస్తాలో కొంత మంది ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ప్రజల్లో మార్పు కానరావడం లేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యు వాత పడుతుండగా, అనేక మంది గాయాల పాలవుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా వాహనదారుల్లో మార్పురావడం లేదు. ముఖ్యంగా ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, మోటార్ సైకిల్‌పై ట్రిబుల్ రైడింగ్‌తో పాటు హెల్మెట్ ధరించక పోవడం ప్రమాదకరంగా మారింది.

జాడలేని భారీ వర్షాలు

- ప్రాజెక్టులకు చేరని వరద..
- అలుగు దూకని చెరువులు
- బీళ్లుగా ఆయకట్టు భూములు
- వెనుకబడిన వరి సాగు
- ఆందోళనలో అన్నదాతలు



పీపీరావు ప్రాజెక్టు

దహెగాం: వర్షాకాలం వచ్చిందంటే ప్రాజెక్టులు, చెరువులకు జలకళ సంతరించుకుంటుంది. నీటితో కళకళ లాడుతుంటాయి. కానీ ఈ ఏడాది వర్షాల జాడలేకపోవడంతో ప్రాజెక్టులు, చెరువులకు వరద నీరు రాకపోవడంతో వెలవెలబోతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో అధికశాతం రైతులు పత్తి సాగు చేశారు. మొదట్లో వర్షాలు సమృద్ధిగా కురియకపోవడంతో విత్తిన పత్తి విత్తనాలు మొలకెత్తక రైతులు ఆందోళన చెందారు. ఆతర్వాత చిన్నపాటి వర్షాలు కురియడంతో పత్తి మొక్కలకు జీవం పోశాయి. కానీ వరిసాగుకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురియలేదు. వర్షాలు కురియక ప్రాజెక్టులు, చెరువుల్లో నీరులేక ఈ ఏడాది వరిసాగు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయి.

బీళ్లుగా వరి పొలాలు..

రైతులు రెండు పంటలు పండించి ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులు, చెరువులను నిర్మించింది. కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో సాగునీరు అందని ద్రాక్షగానే మిగిలింది. ఖరీఫ్‌లో ఆశించిన స్థాయిలో భారీ వర్షాలు కురియకపోవడంతో ప్రాజెక్టులు, చెరువుల్లో ఆశించినస్థాయిలో నీటిమట్టానికి చేరుకోలేదు. దీంతో ఆయకట్టు కింద వరి సాగు పనులు ప్రారంభం కాక పంట పొలాలన్నీ బీళ్లుగానే ఉన్నాయి. బోర్లు, బావులు ఉన్న రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకున్నారు. మరో వారం రోజుల్లో నాట్లు కూడా వేయనున్నారు. కానీ ప్రాజెక్టులు, చెరువులపై ఆధారపడిన రైతులు వరిసాగు ఆలస్యమవుతోందని ఆందోళన చెందుతున్నారు.

జిల్లాల్లో 5 ప్రాజెక్టులు.. 563 చెరువులు

జిల్లాలో ప్రధానంగా కుమురం భీం, వట్టివాగు, చెలిమెల, పీపీరావు, జగన్నాథ్‌పూర్, ప్రాజెక్టులు ఉన్నాయి. కుమురం భీం ప్రాజెక్టు కింద 45 వేల ఎకరాలు, వట్టివాగు ప్రాజెక్టు కింద 24,500 ఎకరాలు, చెలిమెల ప్రాజెక్టు కింద 6 వేల ఎకరాలు, పీపీరావు ప్రాజెక్టు కింద 11,500 ఎకరాలు, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు కింద 15వేల ఎకరాలు, బొక్కివాగు జలాశయం కింద నాలుగువేల ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలో 563 చెరువులు ఉండగా వాటికింద 83 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కుమురం భీం ప్రాజెక్టు నీటి సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.778 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాలువలు పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. వట్టివాగు ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.890 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.219 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీని ద్వారా ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు 70 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. తిర్యాణి మండలంలోని చెలిమెల ప్రాజెక్టులో కూడా వరద నీరు చేరలేదు. మండలంలోని పీపీరావు ప్రాజెక్టు, బొక్కివాగు ప్రాజెక్టులు అలుగు పోయలేదు. వీటి కింద ఆయకట్టు పొలాలు బీళ్లుగానే కనిపిస్తున్నాయి. కాగజ్‌నగర్ మండలంలోని జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 15 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ పూర్తికాకపోవడంతో ఆయకట్టు రైతులు పత్తిసాగు చేస్తున్నారు. కాలువలు సైతం అధ్వానంగా మారాయి.



పీపీరావు ప్రాజెక్టు కింద బీళ్లుగా పొలాలు

పూడికతో నిండిన చెరువులు..

జిల్లాలో 563 చెరువులు ఉండగా అవి చాలామట్టుకు పూడికతో నిండి పోయాయి. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా కొన్ని చెరువుల్లో పూడిక తీయించింది. కొన్ని చెరువులు పిచ్చి మొక్కలతో నిండి పోయాయి. పిచ్చి మొక్కలు తొలగించడం లేదని, పూడిక తీయడం లాంటి పనులు చేపట్టడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు సైతం అధ్వానంగా మారడంతో సాగునీరు అందడం లేదని వాపోతున్నారు.

ఇంకా మొలకే అలకలేదు



పీపీరావు ప్రాజెక్టు కింద నాకు రెండెకరాల పొలం ఉంది. అందులో ఏటా వానాకాలంలో వరి సాగు చేస్తున్నా. ఈ ఏడాది ఇప్పటి వరకు వర్షాలు కురియకపోవడంతో ప్రాజెక్టులోకి వరదనీరు రాలేదు. దీంతో ఇంకా మొలక అలక లేదు. బోర్లు ఉన్నోళ్లు వారం, పది రోజుల్లో నాట్లేస్తరు. – గందం శంకర్, రైతు, కల్వాడ

ప్రాజెక్టులో నీళ్లులేవు



రెండు సంవత్సరాల కింద భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరింది. ఈ ఏడాది ఇంకా వర్షాలు కురియక పోవడంతో ప్రాజెక్టులో నీళ్ల లేవు. భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టు నిండితేనే వరి పంట పండుతది. ఈ ఏడాది నాట్లు ఆలస్యంగా పడేటట్లే ఉన్నాయి. – చౌదరి భాస్కర్, రైతు, పెంచికల్‌పేట్

ఆగస్టు 20 వరకు నాట్లు వేసుకోవచ్చు



వరిలో స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రకాల పంటలు ఉంటాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు స్వల్ప కాలిక వరి రకాన్ని ఎంచుకోవాలి. 120 రోజులకు పంట చేతికి వస్తుంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆగస్టు 20 వరకు వరి నాట్లు వేసుకోవచ్చు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. – శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి

డోర్లి-2 ఓసీపీని సందర్శించిన ప్రొఫెసర్

- పరిసర ప్రాంతాలు పరిశీలించిన సుదీప్తా ముఖోపాధ్యాయ



ప్రొఫెసర్‌కు ఓసీపీ మ్యాప్ వివరిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో మూతబడిన డోర్లి-2 ఓసీపీని శనివారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (సిద్పూర్, పశ్చిమ బెంగాల్) ప్రొఫెసర్ సుదీప్తా ముఖోపాధ్యాయ సందర్శించారు. ఏరియా అధికారులతో కలిసి ఓసీపీని సందర్శించిన ఆయన మూసివేసిన ప్రాంతంతో పాటు ఓసీపీ పరిసర ప్రాంతాల్లో సింగరేణి యాజమాన్యం చేపట్టిన పర్యావరణ, ప్రజాహిత పనులను, కట్టడాలను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణ కోసం సింగరేణి సంస్థ గతంలో నాటిన మొక్కలు, ఎదిగిన వృక్షాలను పరిశీలించారు. అంతకు ముందుకు జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ రవి ప్రసాద్ ప్రొఫెసర్‌కు ఏరియా వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, కార్పొరేట్ అదనపు మేనేజర్లు తిరుపతి, రవీంద్రనాథ్, డోర్లి ఓసీపీ మేనేజర్ మహేష్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఎం.రమేశ్, ఫారెస్టు అధికారి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అడ ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలి



చెరువును పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: అడ ప్రాజెక్టు పనులు త్వ రగా పూర్తిచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఈజీగాం, నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.3, 4, 5, 9, 10 లోని చెరువులను పరిశీలించారు. ప్రభుత్వం సాగునీటి వనరులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అడ ప్రాజెక్టు కాలువలు తవ్వి ఏడేళ్లైనా రైతులకు సాగునీరు అందడంలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసి అడ ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బెంగాలీ క్యాంపు నెం.10లోని అప్పర్‌డ్యాం, క్యాంపు నెం.4లోని లోయర్‌డ్యాంతో పాటు పలు చెరువుల గేట్లు మరమ్మతులకు గురైనా పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లెండుగురె శ్యాంరావు, ఆవుల రాజ్‌కుమార్, రాంప్రసాద్, మిథున్ బిశ్వాస్, నిత్యానంద మహంతు, రాజు, నవీన్, గోపి, విశ్వనాథ్ మండల్, సుజిత్ దాస్, నిరంజన్, షోలెన్, ఇంద్రజిత్, దిలాజ్ బిశ్వాస్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూవివాదంతో వ్యక్తి ఆత్మహత్య

చెన్నూర్: భూవివాదం కారణంగా వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దుగ్నెపల్లి గ్రామానికి చెందిన దాగమ రాజయ్యకు పిల్లలు లేకపోవడంతో 40 ఏళ్ల క్రితం బంధువుల వద్ద నుంచి వెంకన్నను దత్తత తీసుకున్నాడు. రాజయ్య ఆస్తి వెంకన్నకే చెందుతుందని, భావించిన ఆయన సోదరుడు రామయ్య అందులో వాటా కావాలని అడుగుతున్నాడు. దీంతో కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. భూ వివాదం తేలకపోవడంతో వెంకన్న (47) మనస్తాపం చెందాడు. గురువారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. కుమారుడు సంపత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జీఎం కార్యాలయం ముట్టడి



వినతిపత్రం అందిస్తున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: రాష్ట్రంలో నూతన బొగ్గు గనుల వేలం వేయడాన్ని నిరసిస్తూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయాన్ని ముట్టడించారు. ఆరు రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న యూనియన్ నాయకులు కార్యాలయం గేటు ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య మాట్లాడుతూ తెలంగాణ బొగ్గు నిక్షేపాలను కేంద్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలోని బొగ్గు నిక్షేపాలను నామినేషన్ పద్ధతిలో సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. గుజరాత్, ఝార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వ రంగ సంస్థలకు నామినేషన్ పద్ధతిలో కేంద్రం కేటాయించిందన్నారు. సింగరేణికి కూడా అలాగే కేటాయించకపోతే గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జీఎం సంజీవరెడ్డిని కలిసి మెమోరాండం సమర్పించారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కిషన్ రావు, బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొమురయ్య, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, ఫిట్ కార్యదర్శి లక్ష్మణ్, నవీన్‌రెడ్డి, దాడి రాజయ్య, మురళీచౌదరి, సారయ్య, నరసింహారావు మైనింగ్ స్టాఫ్ నాయకులు బాలకృష్ణ, చంద్రమౌళి దేవేందర్ రెడ్డి, లక్కిరెడ్డి సత్తిరెడ్డి రామచందర్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 12 మేకలు మృత్యువాత

తాంసి: తాంసి శివారు బోడగుట్ట ప్రాంతంలో పిడుగుపాటుకు 12 మేకలు మృత్యువాతపడ్డాయి. శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడింది. ఆ సమయంలో మేతకు వెళ్లిన మేకలు మృతి చెందగా మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. మేకల కాపరి కిష్టుకు చెందిన 10, రాములుకు చెందిన 2 మేకలు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని బాధితులు తెలిపారు.

హెచ్‌ఐవీ టెస్ట్ అక్కడే!

- ఉమ్మడి జిల్లాలో 5 'ఐసీటీసీ' కేంద్రాలు మూసివేత
- స్థానికుల ఒత్తిడితో ఖానాపూర్‌లో పునఃప్రారంభం
- చెన్నూర్‌లో కూడా తెరిపించాలని పలువురి డిమాండ్
- ఇబ్బంది పడుతున్న గర్భిణులు, అనుమానితులు



చెన్నూర్ ఏరియా ఆస్పత్రిలో మూసి ఉన్న ఐసీటీసీ కేంద్రం

చెన్నూర్: హేతుబద్ధీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఎయిడ్స్ పరీక్ష కేంద్రాలను మూసివేసింది. తొలి విడుతలో మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలోని చెన్నూర్, మందమర్రిలో గల ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ ట్రెనింగ్ సెంటర్ (ఐసీటీసీ) కేంద్రాలు మూసివేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెన్నూర్, మందమర్రి, ఆదిలాబాద్, ఖానాపూర్, ముథోల్‌లో కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో హెచ్‌ఐవీ పరీక్షలకు అనుమానితులతోపాటు గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. స్థానికుల ఒత్తిడితో అధికారులు ఇటీవల ఖానాపూర్‌లోని కేంద్రాన్ని మాత్రమే పునఃప్రారంభించారు. మరో నాలుగు కేంద్రాలు తెరుచుకోలేదు. చెన్నూర్ ఆస్పత్రిలో కూడా ఐసీపీటీ సెంటర్ పునఃప్రారంభించాలని పలువురు పేర్కొంటున్నారు.

పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి

చెన్నూర్‌లోని 50 పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కానుంది. 100 పడకల మాతాశిశు ఆస్పత్రి భవన నిర్మాణం జరుగుతోంది. వచ్చే ఏడాది వంద పడకల ఆస్పత్రి ప్రారంభం కానుంది. చెన్నూర్‌లో ఎయిడ్స్ పరీక్ష కేంద్రం లేకపోవడంతో చెన్నూర్‌తోపాటు కోటపల్లి, వేమనపల్లి మండలాల బాధితులు, అనుమానితులు మంచిర్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎయిడ్స్ నిర్ధారణ తర్వాత ఏఆర్టీ సెంటర్ గోదావరిఖనికి వెళ్లాల్సిన దుస్థితి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులు, అనుమానితులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా అక్కడికి వెళ్లడం లేదు. వ్యాధి నిర్ధారణ అయినవారు మూడు నెలలకోసారి మందులు తీసుకురావాల్సిన పరిస్థితి.

2007–23 వరకు పరీక్షలు

చెన్నూర్‌లో ఐసీటీసీ కేంద్రాన్ని 2007లో ప్రారంభించారు. అప్పటి నుంచి డిసెంబర్ 2023న కేంద్రాలను మూసివేశారు. 16 ఏళ్లలో చెన్నూర్ కేంద్రంలో 39,821 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 12,814 మంది గర్భిణులకు పరీక్షలు చేయగా 31 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. 27,009 మందికి అనుమానిత స్త్రీ, పురుషుల్లో 341 మందికి హెచ్‌ఐవీ సోకింది. చెన్నూర్ ఐసీటీసీ పరిధిలో 372 మంది ఎయిడ్స్ రోగులు ఉన్నారు. వీరితోపాటు హెచ్‌ఐవీ, టీబీ లక్షణాలు ఉన్న 3413 మందికి పరీక్షలు చేశారు. చెన్నూర్‌లో ఈ పరీక్షలు అందుబాటులో లేక మంచిర్యాలకు పరుగులు తీయాల్సి వస్తుంది.

గర్భిణులు గోస..

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి కోసం వచ్చి గర్భిణులకు తప్పనిసరి ఎయిడ్స్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. చెన్నూర్‌లో పరీక్ష కేంద్రం లేకపోవడంతో మంచిర్యాలకు వెళ్లాల్సి రావడంతో గర్భిణులు గోసపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఎయిడ్స్ రోగుల ఇబ్బందులను గుర్తించి చెన్నూర్‌లో మూసివేసిన ఎయిడ్స్ పరీక్ష కేంద్రాన్ని తిరిగి ప్రారంభించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

వర్షాలకు బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కారాదు

- జీఎం సంజీవరెడ్డి



మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం కారాదని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శనివారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ఈ ఆర్థికసంవత్సరం నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. వర్షాకాలంలో ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని, దీన్ని అధిగమించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఓబీ వెలికితీతలో ఇబ్బందులు అధిగమించాలన్నారు. అనంతరం కాంట్రాక్ట్ కార్మికులకు నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును ఆయన సందర్శించారు. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి టి.శ్రీనివాస్, గని మేనేజర్ ఐ.శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేశ్‌బాబు, సర్వే అధికారి సంపత్, సంక్షేమ అధికారి శంకర్ తదితరులు ఉన్నారు.

దూషించిన కేసులో ముగ్గురిపై అట్రాసిటీ కేసు

భీమారం: మండలంలోని ఆరెపల్లిలో దళితుల భూములను అక్రమంగా పట్టా చేసుకుని దూషించిన కేసులో భీమారానికి చెందిన కట్ట నాగరాజు, చెర్కు సరోత్తంరెడ్డి, పర్తిరెడ్డి మహేశ్వర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదైంది. దళితులపై దాడి చేసిన నల్లాల రాజలింగుపై ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. చెన్నూరు కోర్టులో కట్ట నాగరాజుని హాజరుపర్చగా న్యాయమూర్తి ఆదిలాబాద్ జైలుకి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో బూర్గుడ శివారుప్రాంతంలో పక్కా సమాచారంతోనే పేకాటస్థావరంపై శనివారం దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సై గంగాన్న తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.13,800 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత



మహిళతో బ్లూకోల్ట్స్ పోలీసులు

జన్నారం: మతిస్థిమితం కోల్పోయి మండల కేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హెడ్‌కానిస్టేబుల్ లింగన్న, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం దంతనపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి మానసిక సమస్యతో ఇబ్బంది పడుతుంది. ఆస్పత్రిలో చికిత్స పొందింది. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లింది. కుటుంబసభ్యులు డ్యూటీకి వెళ్లిందని అనుకున్నారు. సాయంత్రం తిరిగి రాకపోవడంతో వెతికినా ఆచూకీ దొరకలేదు. శనివారం జన్నారం బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించింది. ఓ ఇంట్లో బాత్రూమ్‌లో ఉందని 100 డయల్‌కు సమాచారం అందింది. ఎస్సై రాజవర్ధన్ ఆదేశాలతో హోంగార్డు నరేందర్‌తో కలిసి హెడ్‌కానిస్టేబుల్, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్.. బస్టాండ్ ప్రాంతంలో మహిళను గుర్తించారు. ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సాయంత్రం బంధువులు రాగా రాజేశ్వరిని అప్పగించారు. పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

- అభయమిచ్చిన హైకోర్టు
- జనరల్ డీఎస్సీపై కీలక పరిణామం
- ఏజెన్సీకి లోబడే నియామకాలు చేపట్టాలి
- కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి ఆదేశం

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలటౌన్: చెడు అలవాట్లకు బానిసై చోరీకి పాల్పడిన ఏసీసీ ఏరియాకు చెందిన జాదవ్ నర్సింగ్‌ను అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. మంచిర్యాల పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని డీమార్టు పక్కనే ఉన్న అబ్దుల్ రహీం తన ఇంటికి ఈనెల 7న రాత్రి తాళం వేసి ఊరికెళ్లాడు. రాత్రిసమయంలో దొంగ ఆ ఇంటి సీసీ కెమెరా ధ్వంసం చేసి, వెనుక తలుపు పగులగొట్టి చొరబడ్డాడు. సిలిండర్, స్టవ్‌తోపాటు బీరువాలో 5 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. 9న బాధితుడు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈక్రమంలో మంచిర్యాల ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్, ఎస్సై సనత్ సిబ్బందితో కలిసి దొంగను పట్టుకున్నారు. అతన్ని నుంచి 5 తులాల బంగారు ఆభరణాలు, సిలిండర్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. చోరీ కేసును ఛేదించిన సీఐ, ఎస్సై, సిబ్బంది బాబాజీ, సత్యనారాయణ, రాజు పటేల్‌ను ఏసీపీ అభినందించారు.

కెరమెరి(ఆసిఫాబాద్): జనరల్ డీఎస్సీలో గిరిజన ప్రాంత పోస్టుల ఊసే లేకుండా నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న నేపథ్యంలో నాలుగు నెలల క్రితం హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఎట్టకేలకు కాస్త ఊరట లభించింది. హైకోర్టు న్యాయవాది మామిడి సాయియాదవ్ ఏజెన్సీ గిరిజన నిరుద్యోగుల పక్షాన పలు వాదనలు వినిపించిన అనంతరం హైకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. పరీక్షలు యథావిధిగా నిర్వహించవచ్చని, కానీ నియామకాల ప్రక్రియ మాత్రం తాము తీర్పు ఇచ్చే వరకు నిలిపివేయాలని, ఇందుకు సంబంధించి ఎనిమిది వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. జనరల్ డీఎస్సీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 6,459మంది గిరిజన నిరుద్యోగులు డీఎస్సీ పరీక్షలు రాయనున్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఏజెన్సీ పోస్టులు గిరిజనులకే చెందితే అనేకమంది ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంది.

5వ షెడ్యూల్ కీలకం..

ఏజెన్సీ(గిరిజన ప్రాంతంలో)లో చేపట్టే నియామకాలు గిరిజనులకే వర్తించాలని 5వ షెడ్యూల్ చెబుతోంది. ఎలాంటి నియామకాలు చేపట్టినా గిరిజన ప్రాంతానికే లోబడి ఉంటాయి. దీని ఆధారంగానే ఉమ్మడి రాష్ట్రంలో జీవో నంబరు 3 ప్రకారం ఏజెన్సీలో నియామకాలు చేపట్టారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వం గిరిజన చట్టాలు, హక్కులను పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో గిరిజన ప్రాంతంలోని ఉద్యోగ నియామకాలకు సంబంధించిన జీవో నంబర్ 3 కొట్టి వేస్తూ.. రిజర్వేషన్లు 50శాతానికి మించరాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఆ తర్వాత కూడా తెలంగాణ ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో ఏజెన్సీలో 75శాతం రిజర్వేషన్ ఇచ్చింది. కానీ జనరల్ డీఎస్సీలో ఏజెన్సీ పోస్టులపై ఎలాంటి స్పష్టత లేకుండా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో గిరిజన నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉద్యమాలు, ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో పెందోర్ దీపక్ నేతృత్వంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా కాస్త ఊరట ఇచ్చే విధంగా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

చట్టం తేవాలి

జీవో 3 రద్దు వల్ల గిరిజన నిరుద్యోగులు తీవ్ర స్థాయిలో నష్టపోయే అవకాశం ఉంది. ఆదివాసీల సంస్కృతి, ఆచారాలు, యాస, భాష వేరుగా ఉండడం వల్ల రాజ్యాంగంలో 5వ షెడ్యూల్‌ను అమలు చేసింది. ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోకపోవడంతో చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయి. గిరిజనేతరులతో గిరిజనులు పోటీ పడి ఉద్యోగాలు సాధించడం అసంభవం. అందుకే ప్రత్యేక చట్టాలు, జీవోలు తీసుకొచ్చారు. కానీ ప్రభుత్వాలు ఈ విషయాన్ని మర్చిపోయి వ్యవహరిస్తున్నాయి. దేశంలోని గిరిజన ఎంపీలు ఏకమై చట్టసభల్లో ఏజెన్సీలోని ఉద్యోగాలు గిరిజనులకే వర్తించేలా ప్రత్యేక చట్టం తీసుకు రావాలని మేధావి వర్గాలు భావిస్తున్నాయి.

గిరిజన నిరుద్యోగులకు ఊరట



హైకోర్టు ఎదుట ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు

న్యాయం జరిగే వరకు ఆందోళనలు



గిరిజన నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం. మాకు చెందాల్సిన హక్కులు, చట్టాలు గిరిజనేతరుల చేతిలోకి పోతుంటే ఎలా ఊరుకుంటాం. మాకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. వాటిని రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఏజెన్సీలో నియామకాలు 100శాతం గిరిజనులతో పూరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తాం.

– పెందోర్ దీపక్, ఏజెన్సీ డీఎస్సీ హక్కుల సాధన కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

అడవిలో డీసీఎఫ్ పర్యటన



పక్షులను కెమెరాలో బంధిస్తున్న మాధవరావు

జన్నారం: జన్నారం అటవీ రేంజ్‌లో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(డీసీఎఫ్) సిరిపురం మాధవరావు శనివారం పర్యటించారు. నాలుగురేళ్లు జన్నారం ఫారెస్టు డివిజనల్ అధికారిగా పని చేసిన ఆయన బదిలీపై హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. కుటుంబ సమేతంగా ఇక్కడికి వచ్చిన ఆయనకు రేంజ్ అధికారులు సుష్మారావు, హఫీజొద్దీన్ స్వాగతం పలికారు. అనంతరం సిబ్బందితో కలిసి ఇందన్‌పల్లి, జన్నారం అటవీ రేంజ్‌లలో పర్యటించారు. పక్షులను గుర్తించి తన కెమెరాలో బంధించారు. నాలుగున్నరేళ్లు ఇక్కడ పని చేసి వెళ్లినందున చూడాలనిపించి వచ్చినట్లు మాధవరావు తెలిపారు. పచ్చని అడవులు, స్వచ్ఛమైన వాతావరణం ఎంతో బాగున్నాయని అన్నారు. గత కొన్ని నెలలుగా ఈ వాతావరణానికి దూరంగా ఉండడం వల్ల అడవులను చూడాలని అనిపించిందని తెలిపారు.

ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు



గాయపడ్డ ఆనంద్ శ్రీవాత్సవ్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో శనివారం జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు ఆనంద్ శ్రీవాత్సవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మూడవ నంబర్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన కుడి చేతికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

శుభకార్యానికి వెళ్లి తిరిగొస్తుండగా..

- ఆవును తప్పించబోయి చెట్టును ఢీకొన్న కారు
- పదేళ్ల బాలుడి మృతి
- ముగ్గురికి తీవ్రగాయాలు
- టీజీపల్లి సమీపంలో ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



జైషాన్‌రాజ్ (ఫైల్)





తీవ్రంగా గాయపడ్డ జీజుబాయి, గీత

జన్నారం: బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లి తిరిగివస్తుండగా ఎదురుగా వస్తున్న ఆవును తప్పించబోయి కారు చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో పదేళ్ల బాలుడు మృతి చెందగా, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. జన్నారం మండలం టీజీపల్లి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ కథనం ప్రకారం.. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం కొత్తపల్లి (చిక్కులగూడెం)కు చెందిన జాదవ్ గోపిచందు నార్నూర్ సీఐ గన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం మంచిర్యాల జిల్లా మందమర్రిలోని తన బంధువుల ఇంటికి శుభకార్యం కోసం కారులో వెళ్లాడు. శనివారం తెల్లవారుజాము తిరుగుపయనమయ్యారు. టీజీపల్లి సమీపంలో ఆవును తప్పించబోయి అదుపుతప్పి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. గోపిచందు కుమారుడు జైసన్‌రాజ్(10) అక్కడికక్కడే మృతి చెందాడు. గోపిచందు, అతని భార్య జాదవ్ గీత, అత్తమ్మ జీజుబాయిలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. పైలట్ రఫీక్, ఈఎంటీ రమేశ్‌లు వెంటనే అక్కడికి వెళ్లి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. గోపిచందు తమ్ముడు జాదవ్ భీంరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్తను చంపిన అల్లుడు

- ఆపై గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నం
- మంచిర్యాలలో ఘటన



విజయ(ఫైల్)



నిందితుడు వెంకటేశ్



రక్తం మడుగులో విజయ మృతదేహం

మంచిర్యాలటౌన్: అత్తను చంపిన అల్లుడు ఆపై గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని చున్నంబట్టివాడలో నివసిస్తున్న నెల్లి విజయ, శేఖర్ దంపతుల కూతురు మాళవికను శాతం వెంకటేశ్‌కు ఆరేళ్ల క్రితం ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి కుమారుడు ఉండగా, గత రెండేళ్లుగా అత్తమామల ఇంట్లోనే వీరు ఉంటున్నారు. డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్న అల్లుడు, శనివారం రాత్రి ఇంట్లో జరిగిన గొడవలో అత్త విజయ(48)పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్యచేశాడు. తర్వాత నిందితుడు గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. స్థానికులు అతన్ని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు పంపించారు. వెంకటేశ్ మార్కెట్‌లో గతంలో బట్టల షాపు నడిపించగా, నష్టం రావడంతో డ్రైవింగ్ స్కూల్ నడుపుతున్నట్లు తెలిసింది. కాగా, హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

'వైద్యపరీక్షల పేరిట డ్యూటీలకు కొర్రీలు'



మాట్లాడుతున్న డి.బ్రహ్మానందం

శ్రీరాంపూర్: యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు వైద్యపరీక్షల పేరిట డ్యూటీలకు కొర్రి పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం పేర్కొన్నారు. శనివారం నస్పూర్ కాలనీలోని సివిల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు కార్మికులతో ఆయన మాట్లాడారు. ఇటీవల కాంట్రాక్టు ఉద్యోగులకు మెడికల్ క్యాంపులు నిర్వహించి చిన్న సమస్య ఉన్నా డ్యూటీలకు తీసుకోకుండా నాట్ ఫర్ అలో డ్యూటీ అని వైద్యులతో రాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఏనాడు వారి ఆరోగ్యాన్ని పట్టించుకోని యాజమాన్యం నేడు కొత్తగా పరీక్షల పేరుతో డ్యూటీలకు ఇబ్బంది పెట్టడం మానుకోవాలన్నారు. నాయకులు రాజేందర్, శంకర్, తిరుపతి, గోపాల్, అప్పారావు, జంపయ్య, సంపత్, నాగరాజు, కొమరయ్య ఉన్నారు.

'గిరిజన నాయకుడిని గౌరవించని మంత్రులు'



మాట్లాడుతున్న బానోత్ జగన్, తదితరులు

నార్నూర్: రెండుసార్లు ఖానాపూర్ ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా, ఎంపీగా సేవలందించిన రాథోడ్ రమేశ్ అంత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం గిరిజన నాయకుడిని అవమానించడమేనని లంబాడి జేఏసీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ అన్నారు. మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సీనియర్ నేత డీఎస్ అంత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి రాథోడ్‌కు నిర్వహించకపోవడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో ఈనెల 11న చేపట్టిన రైతుల అభిప్రాయ సేకరణకు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కూతవేటు దూరంలో పూలాజీబాబా పాఠశాలలో నిర్వహించిన పెద్దకర్మకు రాకపోవడం శోచనీయమన్నారు. రాథోడ్ రమేశ్‌కు నివాళిర్పించకపోవడం ఆయనపై మంత్రులకు గౌరవం లేదన్నారు. సమావేశంలో లంబాడి జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్, ఫ్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, నాయకులు పవర్ దేవిదాస్, గణేశ్, భీంరావు, రామారావు, సంతోష్, రామ్ మహరాజ్, రాంజీ రాథోడ్, రమేశ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.